**కథ**

# మాకు బహుమతులొద్దు

ఆఫీసు నుండి ఇలా వచ్చి అలా నీరసంగా కుర్చీలో కూలబడ్డ తనను చూసి ''ఎంతసేపయింది వచ్చి..ఉండండి మంచి నీళ్ళిస్తాను'' అంటూ మొహమంతా నవ్వుతూ పలకరించిన భార్య లలితను చూసి విపరీతంగా ఆశ్చర్యపడిపోయాడు రాంబాబు. అంతేకాదు ''ఉండండి. ఆఫీసులో ఎంత అలసిపోయారో ఏంటో'' అంటూ ఓ ప్లేటులో వేడి వేడి పకోడీలు తెచ్చి అతని ఎదురుగా పెట్టి ''తినండి'' అంటూ గారంగా చూసింది.

చెప్పొద్దూ...కంగారు పడిపోయాడు రాంబాబు. ఇది ఏదైనా.. ఎదర జరగబోయే ప్రళయానికి నాందేమోనని అతని గుండె 'లబో దిబో'మని వేగంగా కొట్టుకోవడం మొదలుపెట్టింది.

అవునుమరి..అలా అనుమానించాడంటే కారణం లేకపోలేదు. లలితకూ రాంబాబుకీ పెళ్ళయి పది సంవత్సరాలు నిండుతున్నాయి. మొదట్లో బాగానే అన్యోన్యంగా ఉండేవారు. కానీ ఈమధ్యే ఇద్దరకూ అస్సలు పడ్డం లేదు. ఇద్దరూ ఇంట్లో చాలా ముభావంగా ఉండడం..లేదా ఒకరి ముఖం ఒకరు చూసుకోకుండా నిర్లిప్తంగా మాట్లాడటం. ఇలా ఉంది. వీళ్ళ వ్యవహారానికి, యుద్ధాలకూ పిల్లలిద్దరూ బిక్కుబిక్కుమంటూ కాలక్షేపం చేస్తున్నారు. అవునుమరి. తల్లిదండ్రులలో ఎవరికి కోపం వచ్చినా అది వీళ్ళ మీదకు మళ్ళుతోంది. పైగా లలితకు ముక్కు మీదే కోపం. రాంబాబుది కొంచెం సాత్విక మనస్తత్వం అవడంతో కాస్తలో కాస్త నయం. భార్య గురించి ఆమధ్య లలిత వాళ్ళన్నయ్యకు ఉత్తరం రాశాడు కానీ ఏమీ సమాధానం లేదు. ఈమధ్య భార్య లలిత మరీ రెచ్చిపోతోంది. ప్రతీదానికీ కోపమే. ఆ కోపంలో బిన్ లాడెన్ సైతం కంగారు పడేటంత గొడవ చేస్తుంది. అలాంటిది హఠాత్తుగా ఇవాళ ఇలా అష్టనాయికల లక్షణాలన్నీ పుణికి పుచ్చుకుని రాంబాబు మీద ప్రయోగిస్తే కంగారుపడిపోడూ!

క్షణంలో వెయ్యో వంతులో కనిపెట్టేసింది రాంబాబు ముఖంలో కదలాడే భావాల్ని లలిత.

వెంటనే అతని పక్కనే కూర్చుని చిలిపిగా అతని కళ్ళల్లోకి చూస్తూ ''బాగున్నాయా పకోడీలు'' అంది.

మరింత అయోమయంలో పడిపోయాడు. లలితను అలా నయగారాలు పోతూండగా చూసి ఎన్నాళ్ళయింది. నిజానికి లలిత చాలా అందగత్తె. పెళ్ళయి పదేళ్ళయినా..ఇద్దరు పిల్లలు పుట్టినా ఇంకా 30 ఏళ్ళు వచ్చినా 20 సంవత్సరాల దానిలాగే ఉంటుంది. ''ఇదిగో హార్లిక్స్ తాగండంటూ'' చేతికి హార్లిక్స్‌గ్లాసు అందించడంతో ఈలోకం లోకి వచ్చాడు. ప్లేటులో పకోడీలు ఎప్పుడయిపోయాయో తెలియదు. అంతా విష్ణుమాయలా ఉంది.

ఇంక ఆలస్యం చేయగూడదనుకుంది లలిత. మెల్లగా అతనికి మరింత దగ్గరగా కూర్చుని ''అది కాదండి. మా అన్నయ్య దగ్గర్నుండి ఈరోజు ఫోన్ వచ్చింది'' అంది.

''అయితే!'' అన్నట్లు చూశాడు రాంబాబు.

''విషయమేమిటంటే అదేదో పెద్ద కంపెనీట..వాళ్ళు పెద్ద పెద్ద నగరాల్లో నివసించే ఓ ఉత్తమ సంసారానికి లక్ష రూపాయలు బహుమతిగా ఇస్తారట. మా అన్నయ్య పొద్దున్న ఫోన్ చేసి చెప్పాడు. వాళ్ళు రహస్యంగా ఎవరో అన్నట్టు ప్రతీ ఇల్లూ చూస్తూంటార్ట. ఆ ఇంటి వాతావరణం..భార్యాభర్తల సంబంధం, పిల్లల క్రమశిక్షణ, చదువులు..ఇవన్నీ నచ్చాయనుకోండి. వెంటనే ఆ సంసారాన్ని ఉత్తమ సంసారంగా ప్రకటించి లక్ష రూపాయలు బహుమతిగా ఇస్తార్ట. ఎలా తెలిసిందో ఇది మా అన్నయ్యకు తెలిసింది. ఏం ఆ బహుమతి మనకెందుకు రాకూడదూ..పిచ్చాడు. అస్తమానూ మనం దెబ్బలాడుకోడం చూసి తనకెలాగా ఫరవాలేదనుకుని తొందర్లో మా అన్నయ్య నాకు చెప్పేశాడు. వాళ్ళు అప్పుడే ఎలా ఉండాలో ప్లాన్ చేసేసుకున్నార్ట. ఏవండి..ఇంకిక్కణ్నుంచి మనం దెబ్బలాడుకోకుండా హాయిగా ఉందామండీ'' అంటూ దాదాపు రాంబాబు వళ్ళోవాలిపోయింది లలిత.

గాల్లో తేలిపోయింది రాంబాబు శరీరం. అతనికి అంతా అద్భుతంగా ఉంది. తమకంగా లలితను దగ్గరగా తీసుకుని గాఢంగా ఆమె పెదాలను అందుకున్నాడు.

అతన్నుండి విడివడుతూ ''ఏవండీ..మరొకటి ఈ విషయం ఎవరికీ తెలియకూడదట. అంటే అందరూ రెడీ అయిపోతారట. మా అన్నయ్యకు ఎలా తెలిసిందో తెలిసింది. ఏం!'' అంటూ రాంబాబుకి మరింత దగ్గరగా జరిగింది.

''ఇంకా నయ్యం..నేనేమన్నా..మీ అన్నయ్యలా అమాయకుడిననుకొన్నావా? నువ్వే ఎవరికీ చెప్పకు. అసలే ఆడవాళ్ళ నోట్లో నువ్వు గింజ కూడా నానదట'' అన్నాడు రాంబాబు లలితకేసి చాలా జాగ్రత్త సుమా అన్నట్లు చూస్తూ.

''పాపిష్టిదాన్ని ఇన్నాళ్ళూ నాకోపంతో పిచ్చి దానిలా మిమ్మల్ని ఎన్నేసి మాటలన్నానో'' అంటూ తెగబాధపడిపోయింది లలిత.


''పోనిద్దూ. భార్యాభర్తలన్నాక ఆమాత్రం గొడవలుండవా? నేను మాత్రం..నిన్ను ఎన్నేసి మాటలన్లేదు..ఒకానొక ఏగలో నిన్ను పుట్టింటికి పంపేద్దామనుకున్నాను తెలుసా'' అన్నాడు రాంబాబు.

అదోలా చూసింది లలిత రాంబాబుకేసి.

చెప్పొద్దూ. కంగారుపడిపోయాడు రాంబాబు. అనవసరంగా నోరు జారేశాడు.

కాని లలిత నుండి ఎటువంటి రియాక్షనూ లేకపోయేసరికి మనసులోనే భగవానుడికి 'థాంక్స్' చెప్పుకున్నాడు.

లలిత తెలివితేటలో..రాంబాబు పనితనమో తెలీదుకాని మొత్తానికి పది పదిహేనురోజుల్లో ఆ ఇంట్లో పరిస్థితులు పూర్తిగా మారిపో



యాయి. పొద్దున్నా సాయంత్రం చక్కటి టిఫిన్, మంచి భోజనం, ఆహ్లాదకరమైన వాతావరణం, ఎల్లప్పుడూ నవ్వుతూ భర్త పట్ల, పిల్లల పట్ల లలిత చూపించే ప్రేమ, భార్యకు ఏలోటూ లేకుండా, అప్పుడప్పుడు సినిమాకీ, షికారుకీ తీసికెడుతూ, సాయంత్రం ఆఫీసు నుండి వచ్చీరాగానే పిల్లలిద్దర్నీ నీట్‌గా తయారు చేసి వాళ్ళ చదువులూ, హోమ్‌వర్కులూ చూస్తూ ఇలా రాంబాబు సహకారం.

ఇంచుమించు వాళ్ళిద్దరూ రాబోయే (ఒక వేళ) బహుమతి గురించి మర్చిపోయినప్పటికీ మధ్యమధ్యలో నగరంలో ఎవరైనా 'ఉత్తమసంసారం' గురించి, ఫలానా కంపెనీవాళ్ళు తిరుగుతున్నారేమోనని అప్పుడప్పుడు ఎంక్వైరీ చేస్తూనే ఉన్నారు. అన్నట్టు ఈమధ్య జరిగిన పరీక్షల్లో పిల్లలిద్దరికీ క్లాస్ ఫస్టులు వచ్చాయి. స్కూలు ప్రిన్సిపాల్ వాళ్ళిద్దరికీ క్లాస్‌ఫస్ట్ బాడ్జెస్‌ను స్టేజి మీద ఇచ్చినప్పుడు ఆ పిల్లలిద్దరి కళ్ళల్లో మతాబులు వెలిగాయి. ఆ వెలుగుల్లో రాంబాబు, లలితల ముఖాలు మరింత వెల్లివిరిశాయి.

★ ★ ★

''నిజంగానా'' అంటూ ఆశ్చర్యపోయారు రాంబాబు లలిత తెల్లమొహాలేసుకుని.

''అవును. ఈ విషయంలో చిన్నవాళ్ళయినా నన్ను క్షమించాలి. అయినా మీకోసమే నేనీ చిన్న అబద్ధం ఆడాను'' అని ఇద్దరి మొహాల వంక చూశాడు లలిత అన్న మాధవరావు.

కాసేపాగి ''అవునమ్మా. మీ మంచికోసమే నేనీ చిన్న అబద్ధం చెప్పాను. నిజానికి ఏ కంపెనీ ఇలా బహుమతి ప్రకటించలేదు. కాని ఆ వచ్చే బహుమతి లక్ష రూపాయల కోసం మీరిద్దరూ మీ గొడవలూ, పంతాలు మర్చిపోయారు. సుఖ సంతోషాలతో ఉన్నారు. మీ మొహాల్లో కనబడే ఆ వెలుగులు చూసి నేను చాలా తృప్తిగా ఉన్నాను. నేను చేసింది కరక్టే అనుకుంటున్నాను. అయినా మీరూ ఆలోచించాలి. ఏం? ఇప్పుడు ఆ డబ్బు రాదనుకుంటే మళ్ళీ పోట్లాటలు ప్రారంభిస్తారా. జీవితమంటే డబ్బు కాదు. సంసారంలో డబ్బున్నంత మాత్రాన సుఖ సంతోషాలు రావు. భార్యాభర్తలన్నాక ఒకరిపై ఒకరికి విశ్వాసం, ప్రేమ, అనురాగం ఉండాలి. ఒకళ్ళంటే ఒకరు తపించాలి. ఒకరి కోసం ఒకరు బతకాలి. అఫ్‌కోర్స్...డబ్బుంటే ఓ కొంత ధైర్యమున్నప్పటికి, అది తాత్కాలికమే. మానసికంగా లభించేతృప్తిని డబ్బుతో కొనలేం. రేపు వచ్చే ఆ లక్ష మీలో అశాంతిని కూడా సృష్టించవచ్చు.

భార్యాభర్తలు కొన్నాళ్ళు అనురాగంతోనే ఉంటారు. కొంతకాలం పోయాక బాధ్యతలు, బరువులు, ఇలా వాళ్లలో కొంత నిస్తేజాన్ని కల్గిస్తాయి. అందువలన చికాకులు, చీదరింపులు మొదలవుతాయి. మీ సంసారంలో అదే జరిగింది. రొటీన్ జీవితం కొంత బోర్ కొడుతుంది. అందుకే నేను ట్రిక్ ప్లే చేశాను. బావగారు...మీరూ ఏమనుకోకూడదు'' అంటూ ఇద్దర్నీ ప్రాధేయపూర్వకంగా చూశాడు మాధవరావు. రాంబాబు లలిత ఇప్పుడిప్పుడే విషయం గ్రహిస్తున్నారు.

''నాకిప్పుడు చాలా సంతోషంగా ఉంది. ఇదివరకు ఎప్పుడొచ్చినా మీరిద్దరూ ముభావంగా ఉండేవారు. ఇంటి వాతావరణం కళావిహీనంగా ఉండేది. పిల్లలు దైన్యంగా ఉండేవారు. ఇప్పుడు చూడండీ... మీరెంతో హాయిగా ఉన్నారు...అందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ సంతోషసమయంలో మా చెల్లాయి లలితకు, మీకు పదివేలరూపాయలు బహుమతిగా ఇద్దామనుకుంటున్నాను'' అంటూ చెక్కుబుక్కు తీశాడు మాధవరావు.

వెంటనే లలిత మాధవరావును వారిస్తూ ''అన్నయ్యా నిజంగా మాకు నీపై ఎలాంటి కోపంలేదు. మాకున్న ఈ ఆనందం కొన్ని లక్షల విలువచేస్తుందని గ్రహించాము....మాకు ఏ బహుమతీ వద్దు...నువ్వేమీ బాధపడకు'' అంటూ ఆనందంగా రాంబాబు పక్కన కూర్చుని పిల్లల్ని వళ్ళోకి తీసుకుంది లలిత.

★

**ఎం. ఆర్. ఎస్. శాస్త్రి**